సాక్షి
అనకాపల్లి

ఆదివారం । 30 । మార్చి । 2025





కరుణించమ్మా.. నూకాలమ్మా..



అమ్మవారి అంబలం పూజ నిర్వహిస్తున్న భక్తులు

- అంగరంగ వైభవంగా అమ్మవారి జాతర
- శనివారం రాత్రంతా భక్తుల దర్శనాలు
- సుమారు లక్షమంది దర్శించి ఉంటారని అంచనా
- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకు వస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర



అనకాపల్లి: సంబరం అంబరాన్ని తాకింది. అమ్మను దర్శించి భక్త జనం పులకించింది. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు అమ్మవారిని సుమారు లక్షమంది దర్శించుకొని ఉంటారని అంచనా. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలన్నీ రద్దీగా కనిపించాయి. ఈ ఏడాది నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండగగా జరపాలని నిర్ణయించడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో వెంపల రాంబాబు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, కమిటీ సభ్యులు జాతరకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా మాల ధారణ సంఘం వ్యవస్థాపకుడు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో భారీ అంబలం పూజ నిర్వహించారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ పూజలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఏడుగురు అక్కచెల్లెళ్ల వేప చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కొత్త అమావాస్య పూజ, ప్రత్యేక అలంకరణ, సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం శనివారం సాయంత్రం అమ్మవారి ఆలయాన్ని మూసివేసి, దర్శనాలు నిలిపివేశారు. ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా దర్శనాలు కల్పిస్తారు.

త్వరలో ఆలయ పునఃనిర్మాణ పనులు పూర్తి

అమ్మవారి ఆలయం వద్ద జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. నూకాంబిక ఆలయ పునఃనిర్మాణ పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఉషస్సుల ఉగాది నవ్యతకు నాంది

వసంతం వచ్చేసింది.. 'విశ్వావసు'కు స్వాగతం పలికింది.. మావి చిగుళ్లను తిన్న కోకిలమ్మలు కుహూ కుహూ అంటూ తీయగా పలికాయి.. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి సిద్ధమైంది.. తెలుగు లోగిళ్లలో కొత్త సంవత్సర సందడి మొదలైంది. ఈ ఏడాది ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఆతృతతో ప్రజలు పంచాంగ పఠనం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు, కవుల కవితా ఝరిని ఆస్వాదించడానికి సాహితీప్రియులు ఉవ్విళ్లూరుతున్నారు. ఉగాది సందర్భంగా మామిడి కాయలు మార్కెట్లను ముంచెత్తాయి. ఉగాది పచ్చడికి కావలసిన మామిడి, వేప పువ్వు, ఇతర పదార్థాలను కొనుగోలు చేయడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జిల్లాలోని మార్కెట్లు సందడిగా మారాయి. ధరలు ఆకాశాన్నంటాయి.

నూతన సంవత్సర శోభ

గుమ్మానికి తోరణాలు.. వాకిట్లో రంగవల్లులు.. కొత్త దుస్తుల మెరుపులు.. పిండి వంటల ఘుమఘుమలు.. ఊరూరా పండగ వాతావరణం.. సర్వత్రా నూతన సంవత్సర శోభ తాండవమాడుతోంది. ఉగాది పండగ వేకువజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడతాయి. ఏడాదంతా ఆనందంగా గడవాలని భగవంతుడిని వేడుకుంటారు. కొత్త ఆశలు, కొత్త ఆశయాలతో ఈ సంవత్సరం అందరికీ శుభాలు కలగాలని కోరుకుంటారు. నక్కపల్లి మండలం ఉపమాకలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్రాంత తెలుగు పండిట్, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ వేదాల గాయత్రీదేవి పంచాంగ పఠనం చేస్తారు. అనకాపల్లి నూకాంబిక ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు.

– నక్కపల్లి

నేడు ఉగాది వేడుకలు

తుమ్మపాల: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళ వాయిద్యాలు, పంచాంగ శ్రవణం, వేద పండితుల ఆశీర్వచనం ఏర్పాటు చేశామని చెప్పారు. పంచాంగ పఠనం, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, పండితులను సత్కరిస్తామన్నారు.

బూడి శుభాకాంక్షలు



దేవరాపల్లి: జిల్లా ప్రజలకు మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు అన్నీ శుభాలు జరిగి, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ఆశలు, నెరవేరాలని, పంటలు వృద్ధి సాధించాలని కోరారు.

ఓర్పు, సహనం, సత్ప్రవర్తన..



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

- ఇదే రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశం
- ఇఫ్తార్ విందులో కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: సర్వ మానవాళి సుఖ సంతోషాలే రంజాన్ ప్రార్థనల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. స్థానిక గవరపాలెం పార్కుసెంటర్‌లోని కర్రి రమేష్ ఫంక్షన్ హాల్లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఓర్పు, సహనం, సత్ప్రవర్తనతో ప్రతి ఒక్కరూ మెలగాలన్నది రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశమని ఆమె పేర్కొన్నారు. ఇమామ్, మౌజాన్‌లకు ప్రభుత్వం 6 నెలల గౌరవ వేతనం విడుదల చేసిందన్నారు. ముస్లిం యువత ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష కోసం, డీఎస్సీ కోచింగ్ కోసం విశాఖలో ఏప్రిల్ 6 నుంచి ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ముస్లిం అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఉపవాస దీక్ష విరమించి, ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక దువా ప్రార్థనలు నిర్వహించారు. ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్ మాట్లాడారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎం.సత్య పద్మ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జామియా మసీద్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.ఎన్ హుస్సేన్, కార్యదర్శి ఎం.డి.జిలాని, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయిని నాగజ్యోతికి ఉగాది పురస్కారం



రోలుగుంట: పలు రంగాలలో విశిష్ట ప్రతిభ చూపుతున్న రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని పి.వి.ఎం.నాగజ్యోతి హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఉగాది పురస్కారం అందుకున్నారు. తెలుగు వర్సిటీలోని సృజన ఆర్ట్స్ అకాడమీలో పలు రంగాలలో విశిష్ట ప్రతిభ చూపించిన వారికి అవార్డులు అందజేశారు. వీరిలో ఒకరైన నాగజ్యోతికి తెలంగాణ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఉగాది పురస్కారం అందజేశారు.

నేడు అప్పన్న పెళ్లిరాట

సింహాచలం : సింహాచలంపై ఆదివారం శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామివారి పెళ్లిరాట ఉత్సవం జరగనుంది. ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ వైదికులు, అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. అలాగే ఉగాది పూజలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి విశేష అర్చన, ఉగాది పచ్చడి నివేదన చేస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ఆస్థాన మండపంలో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

రేషన్‌పై ఈ-కేవైసీ కత్తి

- ఈ నెల 31లోపు పూర్తి చేయాలని ఆదేశం
- కుటుంబంలోని అందరూ రావాలని హుకుం
- ఈ-కేవైసీ లేకుంటే వచ్చే నెల రేషన్ కట్!

జిల్లాలోని రేషన్ కార్డులలో సభ్యుల సంఖ్య **14.99** లక్షలు

ఈ-కేవైసీ పూర్తయినవారి సంఖ్య **13,99,989**

ఇంకా చేయించుకోని వారి సంఖ్య **1,00,121**

సాక్షి, అనకాపల్లి: సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఉన్న వాటిని తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు రేషన్ సరకులను పొందుతూ సుఖంగా ఉన్న బడుగులపై తాజాగా ఈ-కేవైసీ అనే అస్త్రాన్ని సంధించింది. వేలిముద్రలను వేసేందుకు కుటుంబంలోని అందరూ రావాలని హుకుం జారీ చేసింది. ఈ ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం వెనుక రేషన్‌లో కోత విధించాలనే దురుద్దేశం ఉందనే విషయం తేటతెల్లమవుతోంది. రైస్ కార్డు ఈ-కేవైసీ చేయించుకోనివారికి వచ్చే నెలలో రేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందకుండాపోయే ప్రమాదం ఉంది. ఇంకా రెండు రోజులే మిగిలి ఉండడంతో లబ్ధిదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

చేయించుకోకుంటే సరకులు బంద్

ఈ-కేవైసీ చేయించుకోకపోతే ఏప్రిల్ నెలలో సరకుల పంపిణీ నిలిపివేస్తారు. కార్డుతో అనుసంధానం కాని వారి జాబితాలను సిద్ధం చేసి, డీలర్లకు ఆ సమాచారాన్ని అందజేస్తున్నారు. జిల్లాలో ఈ-కేవైసీ చేయించుకోని ఐదేళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు రేషన్ షాపులకెళ్లి ఈ పాస్ యంత్రంపై వేలిముద్ర వేసి, డీలర్ లాగిన్లో ఈ-కేవైసీని పూర్తి చేసుకోవాలని చెబుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని పేర్కొంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తమ పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ.. ఈకేవైసీ కోసం వేలి ముద్రలు సేకరిస్తున్నారు. ఫలితంగా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న చిరుద్యోగులు, కూలీ పనులు చేసుకునే వారు దీనికి దూరమవుతున్నారు. ఈ కసరత్తుతో రేషన్ లబ్ధిదారుల సంఖ్యకు భారీగా కోత పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



దూర ప్రాంతాల్లో ఉన్న వారే పెండింగ్..

జిల్లాలో రేషన్‌కార్డుల లబ్ధిదారులకు ఈకేవైసీ ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలి. గడువు తేదీలోగా పూర్తి చేసుకుంటే మ్యాపింగ్ సులభతరం అవుతుంది. లబ్ధిదారులను త్వరితగతిన గుర్తించగలుగుతాం. గ్రామ, వార్డు సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. దీన్ని వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. దూర ప్రాంతాల్లో ఉన్న వారే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ ఇవ్వరన్న భయాలు పెట్టుకోవద్దు.

– మూర్తి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రేపు పీజీఆర్ఎస్ రద్దు

తుమ్మపాల, అనకాపల్లి: ఈనెల 31న రంజాన్ పండగ కారణంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం-పీజీఆర్ఎస్)ను నిలిపివేయనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆరోజున ప్రభుత్వ సెలవు దినం కావడంతో పీజీఆర్ఎస్ రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉగాది, రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

శాప్ కోచ్ అబ్బుకు కోచ్ రిఫ్రెష్ కోర్సు సర్టిఫికెట్



కోర్సు సర్టిఫికెట్ అందుకుంటున్న శాప్ కోచ్ అబ్బు

నర్సీపట్నం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు పాటియాలా పంజాబ్‌లో వారం రోజులుగా నిర్వహించిన ఆల్ ఇండియా కోచ్ రిఫ్రెష్ కోర్స్‌లో నర్సీపట్నంకు చెందిన శాప్ కోచ్ కె.అబ్బు సర్టిఫికెట్ అందుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 26 మంది పాల్గొన్నారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత చంద్రలాల్ (హర్యానా ఖేలో ఇండియా ఎక్సలెన్సీ మేనేజర్) చేతుల మీదగా సర్టిఫికేట్ అందుకున్నారు. ఇంటర్నేషనల్ కోచ్ అబ్బు ఇప్పటికే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారులను తయారు చేస్తున్నారు. అబ్బుకు నింజాస్ అకాడమి డైరెక్టర్లు వెలగా నారాయణరావు, సుత్తాపల్లి శ్రావణ్, శ్రీకాంత్, ఎస్ఆర్ఐ సురేష్, సీనియర్ కోచ్ శేఖర్ అభినందనలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం

తిమిరాంలో చెత్త ఊడ్చిన డీఎల్‌డీవో, జెడ్పీటీసీ


తిమిరాంలో చెత్త ఊడ్చుతున్న డీఎల్‌డీవో మంజులవాణి, జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి : గ్రామాలలో పరిసరా లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సహకరించాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి సూచించారు. తిమిరాం వారపు సంత ప్రదేశంలో శనివారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. డీఎల్‌డీవోతో పాటు జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ చీపురు చేత పట్టి చెత్తాచెదారాలను తొలగించారు. డీఎల్‌డీవో మంజులవాణి మాట్లాడుతూ ఒక్కసారి వినియోగించి విడిచిపెట్టే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని దుకాణదారులకు సూచించారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు.

మహా బడ్జెట్ రూ.4,761.87 కోట్లు

- ప్రారంభపు నిల్వ రూ.482.26 కోట్లు
- అన్ని పద్దుల కింద జమలు రూ.4,279.61 కోట్లు
- ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమ రూ.4,761.87 కోట్లు
- అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.4,601.40 కోట్లు
- ముగింపు నిల్వ రూ.160.47 కోట్లు
- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వెల్లడి



డాబాగార్డెన్స్: జీవీఎంసీ 2025–26 వార్షిక బడ్జెట్‌ను శనివారం కౌన్సిల్లో ప్రవేశపెట్టారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో సభ్యులు చర్చించి ఆమోదించారు. వైఎస్సార్ సీపీ సభ్యులతో పాటు కూటమి సభ్యులు(తెలుగుదేశం, జనసేన, బీజేపీ)తో పాటు సీపీఎం, సీపీఐలు బడ్జెట్‌ను ఆమోదించడం గమనార్హం. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభపు నిల్వ రూ.482.26 కోట్లు. అన్ని పద్దుల కింద జమలు రూ.4279.61 కోట్లు. ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తంగా జమలు రూ.4,761.87 కోట్లు కాగా.. అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.4,601.40 కోట్లు. ముగింపు నిల్వగా రూ.160.47 కోట్లుగా నిర్ణయించినట్టు చెప్పారు. ఏ పద్దుకి ఎంతెంత కేటాయించారో మేయర్ వివరించారు.

ఆదాయం ఇలా.. : 2025–26 సంవత్సరానికి ఆదాయంలో సాధారణ జమల కింద రూ.1,791.19 కోట్లు, మూలధన జమల కింద రూ.2,488.42 కోట్లు. మొత్తంగా రూ.4,279.61 కోట్లుగా చూపారు. అన్ని పద్దుల కింద ప్రారంభపు నిల్వతో కలిపి 4,761.87 కోట్లు జమలుగా ఆశించారు. 2024–25 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో సాధారణ జమలు కింద రూ.1,642.51 కోట్లు, మూలధన జమలు కింద రూ.2,428.22 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి రూ.5,064.80 కోట్లుగా చూపారు. 2024–25 ఏడాదికి ఆశించిన జమలు కన్నా 2025–26 ఏడాదికి ఆశించిన జమల్లో రూ.302.93 కోట్ల తగ్గుదల ఏర్పడింది.

పన్నులు ఇలా.. : జీవీఎంసీ వసూలు చేస్తున్న ఇంటిపన్ను, ఖాళీ జాగాపన్ను, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు చార్జీలు, స్టీల్‌ప్లాంట్, పోర్టు తదితర పారిశ్రామిక సంస్థలు చెల్లించాల్సిన పన్నులు, సర్వీసు చార్జీలు, ప్రకటన చార్జీలు, సెల్‌టవర్స్ చార్జీలు, జంతువులపై పన్ను తదితరవి ఈ పద్దు కింద 2025–26 ఏడాదికి రూ.699 కోట్లుగా చూపారు.

పన్నులు కాని ఇతర ఆదాయాలు : నీటి సరఫరా చార్జీలు, పట్టణ ప్రణాళికా విభాగం వసూళ్లు, షాపు రూముల అద్దెలు, కల్యాణమండపాల అద్దెలు, లీజులు, బల్క్, సెమీబల్క్, ఇతర నీటి సరఫరా చార్జీలు, వ్యాపార సంస్థల లైసెన్స్ ఫీజులు తదితరవి రూ.86.21 కోట్లుగా చూపారు.

ప్రభుత్వం నుంచి ఆదాయం : స్టాంప్ డ్యూటీపై సర్‌చార్జ్, వృత్తిపన్ను, తలసరి గ్రాంటు, మోటారు వాహనాల పన్ను, ఆస్తిపన్ను రాయితీ నష్టపరిహారాలు, మెజిస్టీరియల్ జరీమానాలు తదితరవి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయంగా రూ.230 కోట్లుగా చూపారు.

బ్యాంకులు/ఆర్థిక సంస్థలు/బాండ్లు ద్వారా రుణాలు జోన్–2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి.. జీవీఎంసీ అవసరమైన వాటా రూ.553 కోట్లు బ్యాంకులు/ఆర్థిక సంస్థలు/బాండ్లు/ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల ద్వారా సమకూర్చుకునేందుకు ప్రతిపాదించారు.

ఖర్చుల అంచనాలు : తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రోడ్లు, ఫ్లైఓవర్లు, కాలువలు, భూగర్భ డ్రైనేజీ, పార్కులు, భవనాలు, కల్యాణ మండపాలు, ఆడిటోరియంలు, స్టేడియంల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన, అన్ని వార్డుల్లో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదలను అమలుకు వివిధ పద్దుల కింద బడ్జెట్ కేటాయించారు. 2025–26కి బడ్జెట్ అంచనాల్లో అన్ని పద్దుల కింద రూ.4601.40 కోట్లు అంచనా వేశారు. గతంలో చేపట్టి, పూర్తి కాని పనులు, కొత్తగా మంజూరైన పనులు అంచనాలు, బడ్జెట్ అంచనాలలో తగు కేటాయింపులు చేశారు.

కేటాయింపులు ఇలా.. : జోన్–2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.553 కోట్లు.

➡ రోడ్ల నిర్వహణ, గుంతలు పూడ్చడానికి రూ.77 కోట్లు, రోడ్ల యాన్యుటీకి రూ.70 కోట్లు, తాగునీటి కాలువల నిర్మాణం, నిర్వహణకు రూ.159 కోట్లు, సామాజిక భవనాల నిర్మాణానికి, నిర్వహణకు రూ.70 కోట్లు, వరద నీటి కాలువల నిర్మాణం, నిర్వహణకు రూ.12 కోట్లు, నగరంలో కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.120 కోట్లు, తారు రోడ్ల నిర్మాణానికి రూ.125 కోట్లు.

➡ నగరంలో ప్రధాన, సాధారణ రహదారుల్లో ఆధునిక విద్యుద్దీకరణకు రూ.14 కోట్లు, వీధి దీపాల నిర్వహణకు రూ.30 కోట్లు, పార్కుల విద్యుద్దీకరణకు రూ.7 కోట్లు.

మంచినీటి సరఫరాకు.. : నగరంలో మంచినీటి సరఫరా పథకాల నిర్వహణకు రూ.36 కోట్లు, పైపులైన్ల విస్తరణకు రూ.8 కోట్లు, గొట్టపు బావులు వేసేందుకు, నిర్వహణకు రూ.7.70 కోట్లు కేటాయించారు.

➡ రిజర్వాయర్ల నిర్మాణం, నిర్వహణకు రూ.10.60 కోట్లు, అమృత్ ప్రాజెక్టుకు రూ.310 కోట్లు, ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుకు రూ.60 కోట్లు, కార్బన్ తీవ్రత నివారించేందుకు యూసీసీటీఆర్ఎఫ్ ప్రాజెక్టు ద్వారా స్వాపింగ్ స్టేషన్స్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు రూ.3.30 కోట్లు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల పనుల కోసం సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.450 కోట్లు ప్రతిపాదించారు.

➡ ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, స్త్రీ, శిశు సంక్షేమానికి 5 శాతం అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల్లో మొత్తంగా 27.5 శాతం తగ్గకుండా రూ.239.24 కోట్లు కేటాయించారు.

విద్యా విభాగం

బాల్యం పథకం కింద 3 నుంచి 7 ఏళ్లలోపు బాలలకు చిన్నబడి కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాలతో మున్సిపల్ పాఠశాలలు అనుసంధానం చేసి పౌష్టికాహారం, విద్య, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు రూ.1.50 కోట్లు, నగరంలోని ప్రధాన, సాధారణ, కాలనీ పార్కులు, ట్రాఫిక్ ఐల్యాండ్స్, సెంట్రల్ మీడియన్, వర్టికల్, గూఫ్ గార్డెన్స్ నిర్వహణ, అభివృద్ధికి రూ.56.10 కోట్లు, మియావాకీ అడవుల నిర్వహణ, అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించారు.

నగరాభివృద్ధికి నిధులు ఖర్చు పెడతా..

ఎంపీ ల్యాడ్స్ రూ.10 కోట్లు నగరాభివృద్ధికి ఖర్చు పెడతా. జిల్లా కలెక్టర్‌కు రాజ్యసభ సభ్యుడంటే ఏమాత్రం గౌరవం లేకుండా పోయింది. పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానటరీ సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసం. ఆ సమావేశంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఎన్నో అంశాలుంటాయి. గాజువాకలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం విరిగింది. ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఏవేవో కారణాలు చెబుతున్నారు. జీవీఎంసీ నుంచైనా విగ్రహానికి మరమ్మతులు చేపట్టండి.

– గొల్ల బాబూరావు, రాజ్యసభ సభ్యుడు

లేఆఫ్ ప్రకటించిన క్రెబ్స్ పరిశ్రమ

రోడ్డున పడనున్న 350 కుటుంబాలు


క్రెబ్స్ పరిశ్రమ వద్ద అక్రమ లేఆఫ్ ఎత్తి వేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

కశింకోట: మండలంలోని కొత్తపల్లిలో ఉన్న క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. వచ్చే ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి రానున్నట్లు పరిశ్రమ హెచ్ఆర్ వరప్రసాద్ తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేతతో గత నెల 9 నుంచి పరిశ్రమ పనిచేయడం లేదన్నారు. అప్పటి నుంచి ప్రయత్నాలు చేసినా పరిశ్రమ తెరవడానికి అనుమతులు లభించకపోవడంతో యాజమాన్యం లేఆఫ్ ప్రకటించిందన్నారు. లేఆఫ్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులకు చెందిన దాదాపు 350 కుటుంబాలను ప్రభావితం చేయనుందన్నారు. లేఆఫ్ కాలంలో పరిశ్రమలో పనిచేసే సుమారు 250 మంది ఉద్యోగులకు సగం జీతం చెల్లించడానికి అవకాశం ఉంటుందన్నారు.

కార్మికుల ధర్నా : క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమలో అక్రమ లేఆఫ్ తక్షణమే ఎత్తి వేయాలని కోరుతూ క్రెబ్స్ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, క్రెబ్స్ యూనియన్ అధ్యక్షుడు ఎ.వి.అప్పారావు, కార్యదర్శులు బాబూరావు, కన్నబాబు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలో సుమారు 350 మంది ఉద్యోగులు, కార్మికులు, టెక్నికల్ ఆపరేటర్లు, కెమిస్టులు, ఎస్ఎంఆర్‌లు విధులు నిర్వహిస్తుంటే, 73 మంది కార్మికులను మాత్రమే పనిచేస్తున్నట్లు చూపి అక్రమ లేఆఫ్ ప్రకటించడం చట్టవిరుద్ధమన్నారు. దీనివల్ల ఉద్యోగ, కార్మిక కుటుంబాలు వీధిన పడతాయని, అక్రమ లేఆఫ్‌ను ఎత్తి వేయాలని వారు డిమాండ్ చేశారు.

మానసిక రోగి విశాఖలోని ఆస్పత్రికి తరలింపు


స్థానిక అధికారుల సమక్షంలో మానసిక రోగిని విశాఖలోని ఆస్పత్రికి తీసుకెళ్తున్న బ్రహ్మేంద్ర

దేవరాపల్లి: దేవరాపల్లిలో గత రెండేళ్లుగా సంచరిస్తున్న మానసిక రోగిని ఇదే గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గొరస బ్రహ్మేంద్ర చొరవ తీసుకొని విశాఖలోని మానసిక ఆస్పత్రికి అతి కష్టం మీద శనివారం తరలించారు. హిందీలో మాట్లాడుతూ తన పేరు అడ్రస్ సైతం చెప్పలేని స్థితిలో ఉన్న 45 ఏళ్ల మానసిక రోగి దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలలో సంచరిస్తున్నాడు. ఒక్కోసారి బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు భయాందోళన చెందేవారు. కొందరూ మానవతావాదులు ఆహారాన్ని అందించి ఆకలి తీర్చేవారు. సదరు మానసిక రోగిని విశాఖలోని మానసిక చికిత్స ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి కోసం ఈనెల 14న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బ్రహ్మేంద్ర ఫిర్యాదు చేయగా ఎంపీడీవో, వైద్య ఆరోగ్య, పోలీస్ అధికారులు స్పందించారు. వీరందరి సహకారంతో బ్రహ్మేంద్ర తన సొంత ఖర్చులతో అతనిని విశాఖ మానసిక రోగుల ఆస్పత్రిలో శనివారం చేర్పించారు. బ్రహ్మేంద్ర చూపిన చొరవను అధికారులతో పాటు స్థానిక ప్రజలు అభినందించారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి


నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


న్యాయం చేయాలని కోరుతూ సమావేశానికి హాజరైన నిర్వాసితులు

- నగదు పరిహారం ఇచ్చేలా చూడాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక : పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం జరిగేలా చూడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో శనివారం పూడిమడక రోడ్డు విస్తరణ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి విస్తరణకు రైతులు ముందుకొచ్చి భూములను ఇచ్చేందుకు అంగీకరించడం సంతోషకరమన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి పలు మార్లు అధికారులు గ్రామసభలు నిర్వహించి పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రహదారి విస్తరణ ద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అయితే టీడీఆర్ బాండ్లు బాధితులకు పరిహారం కింద ఇస్తామని చెప్పడం బాధాకరమన్నారు. రైతులకు బాండ్లను వినియోగించుకోవడం తెలియదన్నారు. పార్టీలకు అతీతంగా రైతులకు న్యాయం జరిగేంతవరకు సమష్టిగా ముందుకుసాగాలన్నారు. రైతు సంఘ నాయకులు ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సంజీవరావు,బాధితులు బొడ్డేడ రామచంద్రరావు,బొద్దపు శ్రీరామమూర్తి, భీముని వెంకటేశ్వరరావు,కాండ్రేగుల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు. పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం జరిగేందుకు అవసరమయ్యే నిర్వాసితుల జేఏసీని 30మందితో ఏర్పాటు చేశారు. ఈ నెల 31న అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేసేందుకు వస్తున్న మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి బాధితులకు న్యాయం జరిగేలా వినతి అందించాలని తీర్మానం చేశారు.

రైవాడలో భారీ గిరి నాగు కలకలం


రైవాడలో భారీ గిరి నాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

దేవరాపల్లి: రైవాడలో శనివారం భారీ గిరి నాగు హల్‌చల్ చేసింది. గ్రామంలోని ఓ ఇంటి సమీపంలోకి సుమారు 15 అడుగుల గిరి నాగు ప్రవేశించడంతో ఒక్కసారిగా స్థానిక ప్రజలు హడలెత్తిపోయారు. ఇళ్లల్లో నుండి ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ సుమారు గంటకు పైగా శ్రమించి అతి కష్టం మీద పట్టుకున్నారు. దీంతో స్థానిక ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల కల్లాల్లోని పంట పొలాల్లో భారీ గిరి నాగు రైతులను బెంబేలెత్తించగా, తాజాగా రైవాడలో మరో గిరినాగు కనిపించడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతికి సంతాపం


శేషుకుమార్ (ఫైల్)

మాకవరపాలెం: అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రుత్తల శేషుకుమార్ (47) మృతి చెందారు. మండల కేంద్రంలో నివసిస్తున్న శేషుకుమార్ గత కొంత కాలంగా కాలేయ సమస్యతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి విశాఖలో మృతి చెందారు. శేషుకుమార్ మాకవరపాలెం సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా, ఉప సర్పంచ్‌గా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శేషుకుమార్‌ను ప్రకటించింది. ఆ పదవి పొందకుండానే మృతి చెందారు. ఆయన మృతదేహానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, నర్సీపట్నం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. పార్టీలకతీతంగా మండలవ్యాప్తంగా భారీఎత్తున జనం తరలి వచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఇంటర్వ్యూలకు 585 దరఖాస్తులు


ఇంటర్వ్యూలు చేస్తున్న ఎంపీడీవో వెంకన్నబాబు

రావికమతం : వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రాయితీపై రుణాలు మంజూరుకు శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలు వెలవెల పోయాయి. బీసి కార్పొరేషన్ ద్వారా 33 మంది వెనుకబడిన వర్గాలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు,కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలకు మండలానికి 31 కోట్ల 8 లక్షల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం కేటాయించింది. రాయితీపై రుణాలు పొందేందుకు 585 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకన్నబాబు, బ్యాంక్ మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 70 మంది మాత్రమే ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

పీఎం రైజింగ్ ఇండియా పథకానికి పాఠశాలల ఎంపిక

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా జిల్లాలో 2022–23 సంవత్సరానికి 24 పాఠశాలలు, 2023–24 సంవత్సరానికి 11 పాఠశాలలు ఎంపికయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. ఈ పాఠశాలలకు 15 కెమిస్ట్రీ ల్యాబ్‌లు, 10 కంప్యూటర్ ల్యాబ్‌లు, 3 లైబ్రరీ ల్యాబ్‌లు మంజూరయ్యాయని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి బెంచ్ మార్క్ స్కూల్స్‌గా 45 పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని తెలిపారు. ఈ పథకాల కింద ఎంపికైన పాఠశాలలకు నేరుగా కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయిస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

చింతలపాలెంలో ఇఫ్తార్ విందు



అల్లా బోధనలు వినిపిస్తున్న ఇమాం గౌస్

కశింకోట: మండలంలోని చింతలపాలెం జాఫర్ మసీదులో శనివారం రంజాన్ మాసం పురస్కరించుకొని ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా నమాజు చేశారు. ఇమాం గౌస్ ఖురాన్ చదివి అల్లా ప్రవచించిన వచనాల విశిష్టతను వివరించారు. కన్నూరుపాలెం మసీదు కమిటీ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన విందులో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్.కె. బాబ్జి, ప్రతినిధులు ఎస్.కె. ఇస్మాయిల్, ఎస్.కె. మదీనా, మల్లేష్, షేక్ రెహమాన్, అబ్దుల్, అహ్మద్ పాల్గొన్నారు.

విద్యా కేంద్రానికి పరీక్ష ప్రశ్న పత్రాలు



మండల విద్యా కేంద్రంలో పరీక్ష ప్రశ్న పత్రాలు

అనకాపల్లి టౌన్: ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వచ్చే నెల 7 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు ఉడ్‌పేట మండల విద్యా కేంద్రంలో భద్రపరిచినట్లు ఎంఈవో–2 కోటేశ్వరరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 185 జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రైమరీ, హైస్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్లలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు తగు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

ఒకేషనల్ పరీక్షకు 196 మంది గైర్హాజరు

అనకాపల్లి టౌన్: జిల్లాలో పదో తరగతి ఒకేషనల్ ఎడ్యుకేషన్ పబ్లిక్ పరీక్షకు 196 మంది విద్యార్థులు హాజరు కాలేదని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 4,999 మంది విద్యార్థులకుగాను 4,803 మంది హాజరయ్యారన్నారు.

ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బోయిన చిన్నారావు, కార్యదర్శిగా యేశపోగు సుధాకర్ రావు, కోశాధికారిగా కేఎస్ఎస్ సాయి ప్రసాద్, కో చైర్మన్లుగా జీఎస్ చక్రవర్తి, జాకబ్ రవీంద్ర బాబు, డిప్యూటీ సెక్రటరీలుగా గొంది చిన్నబ్బాయ్, ఆచంట రవి, ఎస్ దుర్గాప్రసాద్, వై జానకీరామ్ నాయుడు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు హాజరై నూతన కమిటీని అభినందించారు.

రగ్బీ పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం రూరల్: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు స్థానిక పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో సీనియర్ విభాగంలో ఎంపికలు నిర్వహించారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో అనంతపురం జిల్లాలో నిర్వహించే ఈ పోటీలకు జిల్లా నుంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
పర్తిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: ఎల్2: ఎంపురాన్ (లూజిఫర్-2)
వెంకటేశ్వర	: షణ్ముఖ
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు , బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 323 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 302 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

మమ్మేలు.. నూకాలమ్మా..

ఎన్టీఆర్ క్రీడామైదానంలో నూకాంబిక నెల రోజుల పండగ




నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఎగ్జిబిషన్‌లో ఆకాశచక్రం



ఎన్టీఆర్ క్రీడామైదానానికి వచ్చే రహదారిలో అమ్మవారి భారీ విద్యుత్ లైటింగ్



రేబాకలో పూజలందుకుంటున్న నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: కొత్త అమావాస్య సందర్భంగా నూకాంబిక అమ్మవారి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతర మే 27వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. రాష్ట్ర పండగగా ప్రభుత్వం ప్రకటించడంతో అనకాపల్లి జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత కలిగింది. ఈ మేరకు ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నెల రోజుల పాటు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. రోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నమయ్య కీర్తనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులను, పెద్దలను, అన్నివర్గాల ప్రజలకు ఆనందాన్ని కలిగించే విధంగా క్రీడా మైదానంలో ఎగ్జిబిషన్, వివిధ రకాల వస్తువులను ప్రదర్శించేందుకు 40 స్టాళ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు క్రీడా మైదానంలో అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణ నెల రోజుల పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనకాపల్లి టౌన్: కొత్త అమావాస్య సందర్భంగా పట్టణంలోని భోగలింగేశ్వర స్వామి ఆలయంలో నూకాంబిక అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి, దీపాలంకరణ సేవ నిర్వహించారు. భోగలింగేశ్వరునికి మహాన్యాస రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పేరూరి చిన్నిస్వామి, సాత్విక్, ఆలయ చైర్మన్ ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్రీడామైదానంలో పల్లెటూరి వాతావరణం ఉట్టి పడే విధంగా ఒంగోలు గిత్తలు, ఎడ్లబండి

తుమ్మపాల: కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వెలసిన నూకాంబిక ఆలయాల్లో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తెల్లవారు నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పసుపుకుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇళ్ల నుంచి వాయిద్యాలు, డప్పులతో గ్రామ పురవీధుల మీదుగా ఆలయాలకు చేరుకుని అగ్నిగుండాలపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సాయంత్రం వరకు సందడి చేశారు. ఆలయాల వద్ద ఆయా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసి విద్యుత్ అలంకరణలతో ఆలయాలను ముస్తాబు చేశారు.

భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య వేడుకలు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో కొత్త అమావాస్య వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటలో స్వయంభూ నూకాంబిక ఆలయాన్ని భక్తులు దర్శించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ఎక్కువగా విచ్చేసి బారులు తీరి చీరలు, రవికెలు, అరటి గెలలు వగైరాలతో దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని అందంగా పూలమాలలతో అలంకరించి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. కొత్త అమావాస్య ఉత్సవాలు ఆదివారం ఉగాదితో ముగియనున్నట్లు తెలిపారు. తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, నరసింగబిల్లి గ్రామాల్లో నూకాంబిక ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు ఎక్కువగా బారులు తీరి దర్శించి వివిధ రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ఆలయాల వద్ద మొక్కులు ఉన్న వారు సంప్రదాయంగా అగ్ని గుండాలు తొక్కారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మిగిలిన గ్రామాల్లోనూ కొత్త అమావాస్య వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.



ఎగ్జిబిషన్‌లో చిన్నారులు తిరిగే చక్రం



భోగలింగేశ్వరుని ఆలయంలో నూకాంబికకు పూజలు

తాకాశివీధి నూకాంబికను దర్శించుకున్న కార్పొరేటర్



కార్పొరేటర్ సునీత, జానకీరామరాజు దంపతులను శాలువాతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో కొత్త అమావాస్య జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు కోరారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అంతకుముందు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాకాశి కిశోర్, సభ్యులు తాకాశి సూర్యారావు, కారకుండి కన్నాయాదవ్, బేతి ఈశ్వరరావు, నాగేశ్వరరావు, తాకాశి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జీవిత సత్యాన్ని తెలిపిన జీవనవేదం



జీవన వేదం నాటికలో సన్నివేశం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వి.వి. రమణ రైతు భారతి కేంద్రంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్, డైమండ్ హిట్స్ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శించిన నాటికలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారిచే ఆకెళ్ల రచించిన 'జీవన వేదం','జరుగుతున్న కథ' నాటికలు ప్రదర్శించారు. ఇందులో భాగంగా తాతలు-తండ్రుల మంచితనం, ప్రజా సేవ, దాన వితరణ వల్ల వాళ్ల ఆస్తి కరిగిపోతుంది. వారి ఇద్దరు కొడుకులు పక్కపక్కనే ఉంటూ ఒకరిపై ఒకరు ఈర్షాసూయలతో రగిలిపోతుంటారు. తండ్రి చెప్పే హితబోధను కాని ఆయన మంచితనాన్ని కాని గుర్తించరు. చివరకు జీవితానికి కావల్సింది సంపద కాదు. నైతిక విలువలు, మనశ్శాంతి అని తెలుసుకుంటారు. అనే ఇతివృత్తంతో ప్రదర్శించిన జీవన వేదం నాటిక ద్రవింపజేసింది.

ఆలోచింపజేసిన జరుగుతున్న కథ

ముసలితనంలో తల్లిదండ్రుల దగ్గర ఉన్న డబ్బు, ఆస్తుల కోసం ఎదిగిన పిల్లలు కన్నీళ్లు పెట్టుకుని ప్రాధేయపడటం, కన్నవాళ్లు కరిగిపోయి ఉన్నది కాస్త వాళ్లకివ్వడం, తర్వాత పని మనుషులుగా వారిని ట్రీట్ చేయడం సమాజంలో జరుగుతున్న కథ. ఎవరికోసం వాళ్లు జీవించే వ్యవస్థలో ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోవడం కన్నా ముందునుంచే ఆరోగ్యం, ఆర్థిక జాగ్రత్తలు తీసుకుని వృద్ధాప్యాన్ని కాపాడుకోవడం మంచిదని నాటిక సారాంశం. ఈ కార్యక్రమంలో బొడ్డేడ జగన్నాథరావు, కర్రి శివుడు, విల్లూరి రాము నాయుడు, పీసీహెచ్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

కశింకోట: మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహణకు సన్నాహాలు చేశారు. స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కనకమహాలక్ష్మి వీధి, కస్పా వీధి, పూసర్ల వీధి ప్రాంతాల్లోని రామాలయాల్లో ఏర్పాట్లు చేశారు. గ్రామ పురోహితులు వచ్చి ఈ ఏడాది ఫలాలు, రాశి ఫలాలు, రైతులకు ఏ పంటలు సాగుకు అనుకూలం తదితర అంశాలపై తెలియజేయనున్నారు. మరోవైపు ఉగాది పచ్చడి తయారీలో వినియోగించే వేప పువ్వు, మామిడి కాయ, బెల్లం, చింతపండుతోపాటు అటుకులు, శనగ పప్పు వగైరా అమ్మకాలు కశింకోటలోని సంత, దుకాణాల్లో జోరుగా సాగాయి.

కశింకోట ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని ఉగాది ఆస్థానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అష్టదళ పాదపద్మ ఆరాధన, 108 బంగారు పూలతో స్వామి వారికి అర్చన, వజ్ర కవచ అలంకరణ చేసి భక్తులకు దివ్య దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా జిల్లా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చునని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శనివారం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యాన పంట శాఖ అధికారులతో టి అండ్ వి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల మధ్య ఉత్పత్తుల కంటే వ్యవసాయం ద్వారా జిల్లా రైతులకు తక్కువ ఆదాయం లభిస్తుందన్నారు. బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తులైన చిన్న బెల్లం ముక్కలు, బెల్లం పొడి, బెల్లం చిరుధాన్యాలతో బిస్కెట్లు, కేకులు వంటి పదార్థాలు తయారు చేయడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. పంటకోత అనంతర పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ విలువ ఆధారిత ఉత్పత్తులతోనే చెరకు రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. దీని ద్వారా చెరకు రైతు కనీసం రూ. 35 వేల అదనపు ఆదాయం పొందవచ్చునని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రీధర్‌రావు మాట్లాడారు. వివిధ మండలాల నుంచి వచ్చిన వ్యవసాయ సహాయ సంచాలకులు జిల్లా వ్యవసాయ పరిస్థితులపై శాస్త్రవేత్తలతో చర్చించి తగిన సలహాలు సూచనలు పొందారు, రాబోయే ఖరీఫ్ సీజన్లో జిల్లాలో చేపట్టవలసిన వివిధ కార్యక్రమాలపై చర్చించారు. శాస్త్రవేత్తలు డి.ఉమామహేశ్వరరావు, ఎం.విశాలాక్షి, బి.భవాని, సిహెచ్ రామలక్ష్మి, ఎంబీబీఎస్ కుమారి పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం



29ఎకెపి103- ఎంపీ సీఎం రమేష్

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాలమ్మ పండగను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎంపీ సీఎం.రమేష్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కోసం కార్యాచరణ చేపట్టామన్నారు. మొదటి ప్రాధాన్యతగా పెందుర్తి, యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నామన్నా రు. మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో ఉపాధి కల్పనే లక్ష్యంగా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.2.5 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకువచ్చామన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామిని పాల్గుణ మాసం చివరి శనివారం పురస్కరించుకొని స్వామివారిని అందంగా పూలమాలలు, తులసీ మాలలతోపాటు వజ్ర కవాలంకృతులను చేసి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. 108 దీపాలతో నక్షత్ర హారతి ఇచ్చారు. భ భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నిలిచిన మంచినీటి సరఫరా

పట్టణ ప్రజలకు ఇక్కట్లు



జీవీఎంసీ మంచినీటి సరఫరా కేంద్రానికి వస్తున్న స్థానికులు

అనకాపల్లి టౌన్: అసలే ఎండాకాలం.. ఆపై అరకొర సరఫరా.. ఇలాంటి పరిస్థితుల్లో ఎటువంటి సమాచారం లేకుండా మంచినీటి సరఫరా ఆగిపోతే ఆ కష్టాలు వర్ణించలేం. ఇటువంటి పరిస్థితే పట్టణ ప్రజలకు శనివారం ఎదురైంది. పట్టణంలో లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీరికి తాగునీటి అవసరాలకు మాత్రమే 60 లక్షల లీటర్ల సరఫరా జరుగుతోంది. ఇతర అవసరాలకు ఇతర మార్గాలపై ఆధారపడుతుంటారు. అయితే కొన్ని ఇళ్లకు మంచినీటి పైపులతో సంబంధం లేకపోయినా, జీవీఎంసీ సరఫరా చేసే మంచినీటిపైనే ఆధారపడే కుటుంబాలు చాలానే ఉన్నాయి. వారికి ఈ నీరు వస్తేనే అవసరాలు తీరుతాయి. ఉదయం సుమారు గంట సరఫరా చేసే నీరు రాక ఇతర మార్గాలపై ఆధారపడి పలు ఇబ్బందులు పడ్డారు. వేరే అవకాశం లేని ప్రజలు ఉడ్‌పేట మంచినీటి సరఫరా కేంద్రం వద్దకు కొంత మంది ప్రజలు వచ్చి మంచి నీటిని పట్టుకున్నారు. ఇకనైనా మంచినీటి సరఫరా ఇబ్బందులు తలెత్తినప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



బోర్ల ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళ

భానుడు భగభగ



కశింకోటలో బోసిపోయిన ప్రధాన రహదారి

కశింకోట: వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరుగుతుండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇక్కడ శనివారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెండు రోజుల క్రితం 37 డిగ్రీలున్న ఉష్ణోగ్రత మరో డిగ్రీ పెరిగింది. దీంతో ఉదయం 11 గంటల నుంచి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటంతో అత్యవసర పనులున్న వారైనా బయట తిరగడానికి సాహసించడం లేదు. దీంతో ఇక్కడి పంచాయతీ ప్రధాన రహదారి, ఇతర వీధులు నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు క్రమేపి తమ కార్యకలాపాలు నిర్వహించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవర అయ్యప్ప

కశింకోట : కశింకోట శివారులో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలివి. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న మోటార్ బైక్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్ నడుపుతున్న కశింకోటలోని దేవర వీధికి చెందిన దేవర అయ్యప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు చిన్న పిల్లలున్నారు.

అధిక లోడు క్వారీ లారీలపై చర్యలు

రూరల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ తుహిన్ సిన్హా



ఫిర్యాదు దారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: పట్టణ, మండలంలో క్వారీలు ఎక్కువగా ఉన్నాయని, అధిక లోడుతో ప్రయాణించే లారీలపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. మండలంలో రూరల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం రాత్రి ఆయన సందర్శించారు. అక్కడ సీసీ టీవీ ఫుటేజీలు, రికార్డులు పరిశీలించి, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మాట్లాడారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో బొజ్జన్న కొండ రహదారిలో వాహనాలు క్రమబద్ధీకరణకు, వాహనాల నియంత్రణకు సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. మైన్స్, విజిలెన్స్ అధికారులతో తరచూ క్వారీలను, క్రషర్‌లను తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ ఆటకు వెళ్లిన బాలుడికి విద్యుదాఘాతం



విద్యుదాఘాతంతో గాయపడిన విద్యార్థి రాజాన గుణశేఖర్

యలమంచిలి రూరల్ : సరదాగా స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా విద్యుదాఘాతానికి గురై 7వ తరగతి విద్యార్థి రాజాన గుణశేఖర్(13) గాయపడ్డాడు. ఈ ఘటన యలమంచిలి పట్టణం పాతవీధిలో శనివారం చోటు చేసుకుంది. కొత్త అమావాస్య కావడంతో పాతవీధిలో కొందరు హైస్కూల్ విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా బంతి పక్కనున్న రేకుల షెడ్డుపై పడింది. దాన్ని తీసేందుకు రేకుల షెడ్డు ఎక్కిన విద్యార్థి గుణశేఖర్ తొందరలో పైన ఉన్న విద్యుత్ వైర్లు చూసుకోకపోవడంతో వాటిని తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గాయపడిన విద్యార్థిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మోడల్ స్కూల్ అభివృద్ధికి కృషి

కశింకోట: మోడల్ స్కూలు అభివృద్ధికి ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి కె. ధర్మకుమార్ ఆదేశించారు. మండలంలో తేగాడ గ్రామం వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూలును శనివారం పరిశీలించారు. ఉపాధ్యాయులతో స్కూలు ప్రగతిపై సమీక్షించారు. 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఎక్కువ మంది విద్యార్థులను ప్రోత్సహించి దరఖాస్తు చేయించి ప్రవేశాలు కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.